# వెయ్యి కాళ్ల జెర్రి

బంగాళఖాతం సముద్రంలోని తిమింగలాలన్ని ఒక్కచోట సమావేశమయ్యాయి. వాటి మొహాల్లో కోపం, ఆవేదన తొంగిచూస్తోంది. ఒక ముసలి తిమింగలం సైలెన్స్...సైలెన్స్ అని అరచింది. గొడవ గొడవగా ఉన్న ఆప్రదేశమంతా నిశ్శబ్దంగా మారింది.

ముసలి తిమింగలం మైకు పుచ్చుకొని...'విషయాన్ని చర్చించేముందు మనమంతా ఒక జె.ఏ.సి గా ఏర్పడాలి...అందులో కన్వీనర్‌గా ఎవరుంటారో చెప్పండి' అంది.

అన్ని తిమింగలాలు ముక్తకంఠంతో మీరే...మీరే...అని అరిచాయి. ముసలి తిమింగలం అందుకు అంగీకరించింది.

"ముందు సమస్యని చర్చిద్దాం...మీరందరూ నిశ్శబ్దంగా వుండండి" అంది.

మళ్ళీ నిశ్శబ్దం...

తిమింగలం గొంతు సవరించుకొని..."ఈ సమస్య మన అస్తిత్వానికి...మన జీవన విధానానికి సంబంధించిన సమస్య...మనల్ని, మన జీవితాల్ని వక్రీకరిస్తున్న సమస్య..." అంది. మిగితా తిమింగలాలన్ని 'అవును...అవును' అని అరిచాయి.

'విషయాన్ని మొదటినుంచి చర్చిద్దాం...సావధానంగావినండి...' అంటూ మొదలెట్టింది.

'భారత దేశంలో ఇప్పుడు మండిస్తున్న సమస్య అవినీతి...ఎక్కడ చూసినా లంచగొండులు...దోచుకునేవారు కోట్లు దోచుకుంటున్నారు. లేని వారికి అన్నం మెతుకులు కూడా దొరకట్లేదు. లేని వారి సంగతి విడిచిపెడదాం...అడ్డగోలుగాదోచుకుంటున్నవన్నీ... అవినీతి నిరోధక శాఖ అనేది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుంటున్నపుడు...ఇప్పుడు మీడియా పెద్దఎత్తున ప్రచారం చేస్తోంది.

అయితే ఇక్కడ మీడియా మనల్ని అవమానపరుస్తోంది. మన వ్యక్తిత్వం అలాంటిది కాకపోయిన...దొరికిన వాన్ని 'అవినీతి తిమింగలం' అంటూ వాళ్ళ పేరుకి జతచేసి టీవీలు...పత్రికలు ఊదర గొడుతున్నాయి. మరి అసలు తిమింగలాలమైన మనం అవినీతి పరులమా...ఎందుకు మనతో పోలుస్తున్నారు...సముద్రములో వున్న బతుకుల్ని ఎందుకిలా భూమ్మీదికి లాగుతున్నారు. చిన్న చేపల్ని తినటం మన జన్మహక్కు మనమెక్కడా లంచాలు తినం...ఆ పదమే మనకు సంబంధంలేనిది. అవినీతిని మన జాతికి జతచేసి మన జీవితాలకి మాయని మచ్చ తెస్తున్న ఈ మీడియా పైన ఆగ్రహం ప్రకటించాల్సివుంది.

మనం భూమ్మీదికెల్లి రాస్తారోకోలు చేయలేం. ఎందుకంటే మనం జలరాశులం. నేల మీద బతుకలేం. అందుకని మనల్ని అవినీతితో పోల్చకూడదని ముందు ఒక వినతి పత్రాన్ని అందరి సంతకాలు సేకరించి మీడియాకి అందచేద్దాం...ఏమంటారు...' అంది.

మిగితా తిమింగలాలన్ని ముక్త కంఠంతో 'మీరు చెప్పినట్టే చేద్దాం' అని అరిచాయి. జెఏసి లోని సభ్యులతో రెండు గంటలు చర్చించి...ఒక ప్రకటన విడుదల చేసాయి.

ఆ ప్రకటన విడుదలైన రెండు నిమిషాల్లోనే...తిమింగలాలకు 'దిష్టి బొమ్మల జెఏసి' మద్దతు ప్రకటించింది.

'మేము మీకు పూర్తిగా మద్దతునిస్తున్నాం...ఎందుకంటే మా పరిస్థితి మీకన్నా అధ్వాన్నం...పచ్చని పొలాల మధ్య పక్షులు రాకుండా రైతులకు ఎంతో ఉపయోగపడే మమ్మల్ని...ఎవరు ఏవిషయంలో ధర్నా చేసినా చౌరస్తాల్లో మమ్మల్నే తగలబెడుతున్నారు. అసలు సమ్మెకు, మా దిష్టిబొమ్మలకూ సంబంధమేమిటి...పక్షుల్ని భయపెట్టి రైతుకు ఆదాయం చేకూర్చే మమ్మల్ని చౌరస్తాల్లో చెప్పుల్తో కొట్టి...తిట్టి తగలబెడుతున్నారు. ఇది సమంజసం కాదని మా డిజిఏసి పోరాడుతోంది. మీది మాలాంటి సమస్యే కాబట్టి...మేము మీకు మద్దతునిస్తున్నాం...' కన్వీనర్ లేఖ పంపారు.

ఇలాగే బస్సుల జెఏసి కూడా మద్దతు తెలిపింది.

తిమింగలాలకు ఇంకా ధైర్యం వచ్చింది.

'మన పోరాటం ఎలా సాగాలో...రేపటి మీటింగులో చర్చిద్దాం.' అని ముసలి తిమింగలం సమావేశాన్ని ముగించింది. తిమింగలాలన్నీ తోకలు పైకెత్తి పిడికిలిలా ముడిచి...తిమింగలాల ఐక్యత వర్థిల్లాలి...అవినీతి పేరుతో...మమ్మల్ని జత కట్టద్దు... తిమింగలాల జేఏసి జిందాబాద్' అంటూ కొంత దూరం ర్యాలీ తీసి..తరువాత ఇంటిదారి పట్టాయి.

ఇంటికి బయలుదేరిన ముసలి తిమింగలాన్ని అనుసరిస్తూ...ఓ చిన్న తిమింగలం...' తాతా...అవినీతి అంటే ఏంటి? లంచం అని దేన్నంటారు. నాకు చెప్పవా...అన్నా హజారె వెంట దేశమంతా ఎందుకు కదులుతోంది.' అని అడిగింది.

ముసలి తిమింగలం నవ్వి...'అది చెపితే రామాయణ, మహాభారతాలకన్నా పెద్దకథే అవుతుంది. పిల్ల తిమింగలానివి...నీకర్థం కాదు కూడా...నీ చిన్ని మెదడుకి అర్థమయ్యేటట్టు లంచం అంటే ఏమిటో ఒకడి కథ చెపుతాను...విను' అంటూ చెప్పసాగింది.

❀ ❀ ❀

అప్పారావ్‌కి సూపర్నెంట్‌గా ప్రమోషన్ రావటంతో ఆనందంగా వుంది. కోలీగ్స్, బందుమిత్రుల నుంచి ఫోన్‌లే ఫోన్‌లు...కొందరు నేరుగా స్వీట్ ప్యాకెట్లు తెచ్చిస్తున్నారు. అందరి నోటినుంచి ఒకటే మాట..."కంగ్రాట్స్ అప్పా...మంచి పోస్టులో పడ్డావ్...పిచ్చి డబ్బు...ఇప్పటికే సంపాదించావనుకో...ఐదంతస్తుల బిల్డింగ్...రెండుకార్లు...హైదరాబాద్‌లో నాలుగు అపార్టుమెంటులు...అరవై ఎకరాల మామిడితోట...నలభై తులాల బంగారం...ఇప్పుడింకా నాలుగింతలు సంపాదించొచ్చు" అని అందరూ పొగుడుతుంటే అప్పారావ్ ఉగాది బూరెలా ఉబ్బితబ్బిబ్బయిపోయాడు. పార్టీలిచ్చాడు...భార్యాపిల్లలకి ప్రెజెంటేషన్‌లిచ్చాడు. పది వేళ్ళకున్న ఇరవై ఉంగరాల్ని చూసుకుని గర్వంగామురిసిపోయాడు. ఎడమచేతి చిటికన వేలికి ఇంకో ఉంగరం పట్టేంతా సందు కనిపించింది.

"రేపు చోటాకాంట్రాక్టర్ వెంకటేష్‌గాడొస్తాడు కదా...వాడిచ్చే డబ్బుతో ఉంగరం చేయించాలి. రేపు వాడు ఎలాగైనా నలభైవేలు తెస్తానన్నాడు. ముందు పదివేలిస్తానన్నాడు. పదిహేను రోజులు తిప్పించుకున్నాక ఇరవై వేలకొచ్చాడు...అప్పుడు నెలరోజులు తిప్పుకున్నాను. ముప్పయి వేలకొచ్చాడు. ఆరునెల్లు తిప్పుకుంటే గాని...నలభై వేలకి గాని రాలేదు. పొద్దున్నే ఫోన్ చేస్తే...ఆ డబ్బంతా నాక్కాదు. పై అధికారులకు

ఎవరికెంతియ్యాలో లెక్కలేసి చెప్పాడు.

అధికార్ల పేర్లతో సహా చెప్పాడు...అప్పటికి గానీ వాడు దారికిరాలేదు..." అనుకుంటు నిద్రపోయాడు.

పొద్దున్నే..." ఏవండీ...మీకోసం ఎవరో వచ్చారు". అని భార్య చెపితే ఆవలించుకుంటూ వచ్చి హాల్లో నిల్చున్న వెంకటేష్‌ని చూసాడు. సోఫాలో కూచుంటూ నిర్లక్ష్యంగా ' నా నిద్ర పాడుచేసావ్ గదయ్యా...సరేగాని...ఏంచేసావ్' అనడిగాడు.

వెంకటేష్ ప్యాంటు జేబులోంచి డబ్బుతీసి 'నలభై వేలు తెచ్చాన్సార్' అంటూ డబ్బు చేతుల్లో పెట్టాడు. ప్రమోషనొచ్చాక మొదటి సంపాదన...అప్పారావ్ తృప్తిగా చూసుకుంటున్న సమయంలోనే...ఒక కప్పమీద నాలుగు పాములు లటుక్కున ఎటాక్ చేసినట్టు నలుగురు వ్యక్తులొచ్చి అప్పారావ్‌ని పట్టుకున్నారు. అప్పారావ్ కంగారు పడుతుంటే...'మేం ఎసిబి...' అని ఒక అధికారి చెప్పి సెల్‌ఫోన్లు లాక్కున్నాడు. ఇంట్లోవాళ్లందరిని ఒక చోట కూర్చోబెట్టారు. క్షణాల్లో పేపర్, టీవి మీడియా వాళ్ళు ప్రత్యక్షమయ్యారు. ఇల్లంతా సోదాచేసి బంగారం, వెండి, భూముల కాగితాలు అన్నీ తీసుకొచ్చి మీడియా ముందుంచారు.

నిమిషంలోనే...న్యూస్ చానల్లన్నీ...భయంకరమైన బ్యాగ్రౌండ్ మ్యూజిక్‌తో బ్రేకింగ్ న్యూస్‌లేసారు...ముసలి తిమింగలం చెప్పటం ఆపి...కాసేపు రిలాక్స్‌అయింది.

పిల్ల తిమింగలం ఆసక్తిగా...అనుమానంగా చూసి...

'ఇంత వరకూ బాగానే వుంది. కాని మనకేంటి సంబంధం'అని క్వొశ్చనేసింది. ముసలి తిమింగలం ఓసి వెర్రిబాగుల్దానా...అన్నట్టు ఓ లుక్కేసి...

'పిచ్చిదానా...ఉన్నదంతా ఆ బ్రేకింగ్ న్యూస్‌లోనే...' అంది.

పిల్ల తిమింగలం "బ్రేకింగ్ న్యూస్‌లో ఏం పాడవుద్ది...లంచగొండి అప్పారావ్ పట్టివేత లేదంటే లంచం తీసుకుంటున్న వ్యక్తిని పట్టుకున్న అధికార్లు...అంతేగా..." అంది.

ముసలి తిమింగలం సీరియస్‌గా చూసి..."అలా అయితే మనకెందుకు కోపమొస్తుంది. బ్రేకింగ్ న్యూస్‌లో...

'ఏసిబికి పట్టుబడ్డ అవినీతి తిమింగలం'

'ఏసిబి వలలో చిక్కిన భారీ తిమింగలం'

'లంచగొండి తిమింగలాన్ని వలపన్ని పట్టిన అధికార్లు'

'నలభై వేలు మింగిన మరో తిమింగలం'

కె.వి.నరేందర్

పత్రికల్లోను, టీవీల్లోను ఇలా మనల్ని, మన జాతిని అవమాన పరుస్తున్నారు. దాని గురించే మన పోరాటం...' అంది.

'ఓహో...అలాగా...' అంది పిల్ల తిమింగలం. కాసేపయ్యాక...'లంచమంటే ఏంటో తెలిసింది తాతయ్యా...నేను ఆడుకోవడానికి వెల్తాను' అంది.

ముసలి తిమింగలం నవ్వి...'పిచ్చిదానా...అసలు లంచాల కథ ఇక్కన్నించే మొదలవుతుంది' అంది.

పిల్ల తిమింగలం వెళ్ళబోతున్నదల్లా ఆగి...'అవునా...అదెలా...'అంది ఆశ్చర్యంగా... ముసలి తిమింగలం మళ్ళీ చెప్పటం మొదలెట్టింది.

❀ ❀ ❀

అప్పారావ్‌ని పట్టుకున్న దృశ్యాలు టీవీల్లో చూసిన బంధువులు భయం భయంగా...'దొంగ నా కొడుకు...మనకేనాడు రూపాయిచ్చిన పాపాన్న పోలేదు కానీ...ఈ ఏసిబి వాళ్ళు బంధువుల ఇళ్ళ మీద కూడా దాడి చేస్తారట...'అంటూ నూటొక్క బూతులు తిట్టుకుంటు ఇళ్ళకి తాళాలేసుకొని పారిపోయారు.

టీవీలో నోట్ల కట్టలు, బంగారు ఆభరణాలు, వెండి సామాను, భూముల కాయితాలు చూస్తున్న మిత్రులంతా...సంతోషంతో విప్పారిన మొహాలతో...'వీడికి భలేశాస్తి జరిగింది. పదివేల అప్పడిగితే ఎన్నడూ ఇవ్వలేదు. వాడికి మన ఉసురే తగిలింది' అని ఆనందంగా శాపనార్థాలు పెడుతున్నారు. సెల్‌ఫోన్‌లో రికార్డయిన మాటలు టీవీల్లో వినిపించటంతో...'వీడు మనపేరు చెప్పి మనల్ని ఇరికిస్తాడా ఏంటీ' అని ఆఫీస్ కొలీగ్స్ తిట్టుకుంటున్నారు.

కట్ చేస్తే సీను...అంతఃపురం నుంచి జైలుకు మారింది.

'మావారిని చూడాలి...'భార్యా పిల్లల దీనమైన మొహాలు...

ఒక పచ్చనోటు నిశ్శబ్దంగా చేతులు మారింది.

మర్నాడు...'మా వారికి ఎలాగైనా తినడానికిదివ్వండి'

మరి కొన్ని నోట్లు చేజారిపోయాయి.

సెల్‌లో వున్న అప్పారావ్‌కి టాయిలెట్స్ క్లీన్ చేసేవాడి జేబులో సెల్లు కనిపించింది. అప్పారావ్ 'ఒక్కసారివ్వవా...మా వాళ్ళతో మాట్లాడిస్తాను' అన్నాడు.

'ఎంతిస్తావ్'

'ఎంతో కొంత'

అప్పారావ్ ఆదుర్దాగా బామ్మర్దికి ఫోన్ చేసాడు 'బెయిల్ సంగతేమయింది? అని

'బావా...అడ్వకేట్‌ని కలిసాను. ఇప్పుడు లక్ష ఇవ్వమన్నాడు. కేసు కొట్టేసిన తర్వాత మరో లక్ష ఇవ్వండంటున్నాడు.'

అప్పారావ్ గతుక్కుమన్నాడు...'సరే ఇవ్వండి' అన్నాడు.

'నా దగ్గర డబ్బుల్లేవ్ బావా...' సెల్లులోనే చేతులెత్తేసాడు బామ్మర్ది.

అప్పారావ్‌కి కోపం, బాధ కలగలిపి వచ్చాయి.

'మూర్తి దగ్గర మూడు లక్షల చిట్టీ కడుతున్నాను. అవి తీసుకో... నాకిక్కడ నరకం కనిపిస్తుంది.' అని ఫోన్ పెట్టేసాడు.

ఆ సెల్లులోనే వున్న మరో అయిదుగురు ముసి ముసి నవ్వులు నవ్వారు. అప్పారావ్ సిమెంటు గద్దె మీద కూచున్నాక ఒకాయన 'ఎంత బాసూ' అన్నాడు.

'నలభై వేలు...మీరు...'

'పన్నెండు లక్షలు...'

అప్పారావ్ గుండె ఆగిపోయింది.'మనది అయిదు లక్షలు' అన్నాడొకడు. మరొకడు దీనంగా 'నాది రెండొందలు' అన్నాడు.

'నాది యాభైవేలు...కానీ బాసూ...బెయిలు అంత తొందరగా ఇవ్వరు' అన్నాడు.

చివరికి మూడు నెలలకి బెయిలు దొరికింది. ఇంటికొచ్చాక పలకరించడానికి ఒక్కడూ రాలేదు. ఓరోజు సాయంత్రం ఒక బ్రోకర్ వచ్చి కూల్‌గా పరిచయం చేసుకున్నాడు.

'ఆరు నెలల్లో ఉద్యోగమిప్పిస్తా...సెక్రటేరియేట్‌లో నాకందరూ తెలుసు. మీ డిపార్టుమెంటు మినిస్టర్ మన చుట్టమే...నాలుగు లక్షలు ఖర్చవుతాయి. ఇప్పుడు మూడు...పోస్టింగ్ ఇచ్చాక లక్ష...ఆలోచించుకో' అన్నాడు.

రెండ్రోజుల్లో బాధగా మూడు లక్షలు తెలిసిన వాళ్ళ దగ్గర వడ్డీకి తెచ్చి బ్రోకర్ చేతుల్లో పెట్టాడు.

'కోర్టు కేసు సంగతి మాత్రం నాకు సంబంధించింది కాదు. ఒక పని చేయండి...మిమ్మల్ని పట్టిచ్చినోడి దగ్గరి కెళ్ళి బతిమాలుకోండి. కేసు విత్‌డ్రా చేసుకొమ్మని...' అని చెప్పాడు బ్రోకర్.

అప్పారావ్ మర్నాడే దీనంగా వెంకటేష్ ఇంటికి వెళ్లాడు. అతడు పట్టించుకోలేదు. అప్పారావ్ అతడి చేతులు పట్టుకున్నాక...కసిగా చెప్పాడు.

'లక్షరూపాయలివ్వండి...కేసు విత్‌డ్రా చేసుకుంటాను.'

అప్పారావ్ మరింత దీనంగా తలాడించి వచ్చాడు. ఆరు నెలలు అష్టకష్టాలు పడ్డాడు. మొత్తానికి వేరే సిటీలో పోస్టింగ్ ఇచ్చారు.

ఆ ఆఫీస్‌కి వెళ్ళిన అప్పారావ్‌ను మొదటి రోజు విచిత్రంగా చూసారు. అలా చూసింది లంచం తీసుకున్నందుకు కాదు. అంత ఈజీగా ఎలా పట్టుబడినావ్ అని...ఆ ఆఫీస్‌లో కూడా లంచం అనేది అత్యంత సాధారణం అన్నట్టుగా మాట్లాడారు. అప్పుడప్పుడు దానికి దేశభక్తిని ముడేసి జోకులేసుకుంటున్నారు.

అటెండర్ రాజయ్య రోజుకి కనీసం వంద జేబులో పడాలంటాడు. అతన్ని 'వందే మాతరం రాజయ్య' అని స్టాఫ్ ముద్దుగా పిలుచుకుంటారు. వందే మాతరం అంటే...వంద ఏ మాత్రం...కనీసం రెండొందలైన సంపాదించాలనేది వాడి ఫిలాసఫీ...

సీనియర్ అసిస్టెంటుకి ఈ మధ్యే 'అన్నా...హజారే' అని పేరు పెట్టారు. కనీసం వెయ్యి రూపాయలన్నా (హజార్ అంటే హిందీలో వెయ్యి) పట్టుకు రాక పోతే వాళ్ళావిడ తిట్టి పోస్తుందట. పెద్ద మొత్తం లంచం దొరికిన రోజు పార్టీ చేసుకుంటూ 'భార' త మాతాకి జై అంటారట.

వాళ్ళందరిని చూసాక అప్పారావ్‌కి మళ్ళీ ధైర్యమొచ్చింది.

తన సీట్లో కూచన్న అప్పారావ్‌కి తీసుకున్న నలభై వేలు గుర్తొచ్చాయి. పోయిన లంచాలు ఆరు లక్షల పైనే అని గుర్తొచ్చాయి. కోపంతో పల్లు ఫట ఫట కొరికాడు.

'ఆరుకి...పన్నెండు సంపాదించాలి...నిండా మునిగాం...చలెక్కడిది. ఖచ్చితంగా ఆరుకి పన్నెండు సంపాదిస్తా...' అనుకున్నాడు.

'ఇదీ...ముదిరిపోతున్న అవినీతి కథ...' అంటూ ముగించింది ముసలి తిమింగలం. పిల్ల తిమింగలం ఇంకా అలాగే నోరు తెరిచి ఉండిపోయింది.'

'ఛీ...ఇలాంటి వాళ్ళకు మన పేరు తగిలించడమా...నేనూ మీతో పోరాటం చేస్తా' అంది పిల్ల తిమింగలం పది రోజుల తర్వాత...

అప్పారావ్‌కి తన టేబుల్ మీద న్యూస్ పేపర్లో అవినీతి అనే పదం కనిపించింది. ఆ వార్త చదివాక అప్పారావ్‌కి  ముచ్చెమటలు పోసాయి. గుండె నిమిషం పాటు ఆగింది.

మరోసారి ఆ వార్త చదివాడు.

'అవినీతి...అదో వెయ్యి కాళ్ల జెర్రి...ఒక్క కాలిని నరికితే అది చావదు. అది చావాలంటే కాళ్లని కాదు...తలని నరకాలి. వెయ్యి కాళ్ల జెర్రిలాంటి...

లంచగొండుల్ని మాతో పోల్చవద్దు. అలాగే ఇక నుంచి అలాంటి వారిని పట్టుబడిన వెంటనే ఉద్యోగంలోంచి డిస్మిస్ చేయాలి...అయినా...ఇదేంటి...కోట్లు మింగేవాళ్లని విడిచిపెట్టి ...కోడిగుడ్డు మింగేవాళ్లని పట్టుకోవడం. ఎవరైనా సరే...డిస్‌మిస్ చేయడమే సరైన శిక్ష..'

తిమింగలాల విన్నపాన్ని...ప్రభుత్వం ఒప్పుకుంటే...

జీవోని విడుదల చేస్తే... అనే ఆలోచన అప్పారావ్‌ని అతలా కుతలం చేసింది. అది చూసిన అటెండర్ రాజయ్య 'అరే...ఏంటీ సార్...ఆ వార్త చదివి జీవో రిలీజ్ అయితే ఎట్లని పరేషాన్ అవుతుండ్రా...జీవో రిలీజ్ కాకుండా లంచమిస్తే సరి...' అనేసి నవ్వుతూ వెళ్ళిపోయాడు.

అప్పారావ్‌కి అప్పుడు...మనసు కుదుటపడింది.

కథా నిలయం
శ్రీకాకుళం